క్లుప్తంగా

శ్రీశైలం మల్లన్నను దర్శించుకున్న మాజీ మంత్రి జోగి రమేష్



ఇబ్రహీంపట్నం: శ్రీశైలం భ్రమరాంబిక మల్లికార్జునస్వామి వార్లను మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ మైలవరం నియోజకవర్గ సమన్వయకర్త జోగి రమేష్ దర్శించుకున్నారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి మల్లన్న ఆలయాన్ని ఆదివారం ఆయన సందర్శించారు. ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో వారికి స్వాగతం పలికారు. స్వామివార్లకు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ పండితులు వేద ఆశీర్వచనాలు అందజేశారు. ఆలయ విశిష్టతను వివరించారు. అంతకుముందు ఇబ్రహీంపట్నంలోని ఆయన నివాసంలో దుర్గా సప్తసతి (చండీహోమం) భక్తిశ్రద్ధలతో జరిపారు. జోగి రమేష్ ఆయన సతీమణి జోగి శకుంతలమ్మ, కుమారులు, బంధుమిత్రులు పాల్గొని దుర్గమ్మ అమ్మ వారి ఆశీస్సులు పొందారు.

డీఈఈ కొండలరావుకు పదోన్నతి



ఇబ్రహీంపట్నం: ఏపీఎస్పీడీసీఎల్ ఇబ్రహీంపట్నం సబ్ డివిజన్‌లో డీఈఈగా పనిచేస్తున్న కావేటి కొండలరావుకు పదోన్నతి లభించింది. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పదోన్నతి కల్పించి బాపట్ల జిల్లా విజిలెన్స్ అధికారిగా బదిలీ చేస్తూ ఉన్నతాధికారుల నుంచి ఆదివారం ఉత్వర్వులు వెలువడ్డాయి. 2021లో ఇబ్రహీంపట్నం సబ్ డివిజన్‌లో ఆయన బాధ్యతలు స్వీకరించారు. కరోనా కష్టకాలం, కృష్ణానది, బుడమేరు వరదల సమయంలోనూ ఆయన కీలకంగా పనిచేసి ఉత్తమ సేవలు అందించారు. ప్రజలు, ప్రభుత్వం నుంచి ఆయన ప్రశంసలు పొందారు. రైతులకు 9 గంటల ఉచిత విద్యుత్ సక్రమంగా అమలు చేసి రైతుల నుంచి మన్ననలు అందుకున్నారు. ఆయన స్థానంలో జి.గురుకిశోర్ బాధ్యతలు స్వీకరించారు.

వాటర్‌లైన్ కోసం ఐరన్ వంతెన నిర్మాణం



జి.కొండూరు: జి.కొండూరు బైపాస్ వై జంక్షన్ నుంచి ఎ. కొండూరు మండలానికి స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు చేపట్టిన కృష్ణా వాటర్ పైప్‌లైన్ విస్తరణలో భాగంగా జి.కొండూరు శివారులోని 30వ నంబర్ జాతీయ రహదారికి సమాంతరంగా పులివాగుపై ఐరన్ వంతెనను నిర్మిస్తున్నారు. పులివాగులో వర్షాకాలంలో వచ్చే వరదలను సైతం తట్టుకునేలా ఈ వంతెన నిర్మాణం చేస్తున్నారు. రూ.49 కోట్లతో చేపట్టిన ఈ పైపులైను విస్తరణ పనులలో భాగంగా పులివాగు మీదుగా పైపును వేసేందుకు మొత్తం ఇనుప గడ్డర్లతో నిర్మిస్తున్నారు. ఈ వంతెనకు రూ.30 లక్షల వరకు ఖర్చు పెడుతున్నట్లు తెలుస్తుంది. విజయవాడ కృష్ణానదిపై ఉన్న రైల్వే వంతెన ఆకారంలో తయారు చేస్తున్న ఈ వంతెనను అటుగా వెళుతున్న వాహన చోదకులు ఆసక్తిగా తిలకిస్తున్నారు.

అరకొర మరమ్మతులతో ప్రజల ఇబ్బందులు



చాట్రాయి: మండలంలోని చనుబండ, నరసింహారావుపాలెం ఆర్అండ్‌బీ రోడ్డుపై ఏర్పడిన పెద్ద గుంతలకు అరకొరగా మరమ్మతులు చేశారు. ఈ గుంతలతో మళ్లీ ఇబ్బందులు పడతామని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రోడ్డుపై గుంతలకు పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పంచాయతీ బోరు ఏర్పాటు



చాట్రాయి: మండలంలోని చిన్నంపేట గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఆదివారం బోరు ఏర్పాటు చేశారు. వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా బోరు ఏర్పాటు చేశామని సర్పంచ్ పరసా ధనలక్ష్మి తెలిపారు.

పనులు చేసినా పస్తులే!

- అర్ధాకలితో ఉపాధి కూలీలు
- రెండు నెలలుగా నిలిచిన బిల్లుల చెల్లింపు
- ఉపాధి బిల్లుల కోసం ఎదురుచూపులు



జూపూడి పెదలంకలో ఇంకుడు గుంతలు తీస్తున్న ఉపాధి హామీ కూలీలు



దాములూరులో రెండు నెలలుగా నగదు చెల్లింపులు జరగని గోకులం షెడ్డు

ఇబ్రహీంపట్నం: ఉపాధి హామీ పథకంలో పనులు పూర్తి చేసి రెండు నెలలు గడుస్తున్నా బిల్లులు చేతికి అందక కూలీలు అర్ధాకలితో అలమటిస్తున్నారు. ఉపాధి హామీ పథకంలో ఉద్యాన పంటలు, పశువుల షెడ్లు నిర్మించుకున్న వారిదీ ఇదే పరిస్థితి. షెడ్లు పూర్తి చేసి రెండు నెలలు అవుతున్నా బిల్లులు మంజూరు కాలేదు. ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి నెలకొంది. పనుల కోసం చేసిన అప్పుకు వడ్డీలు కట్టాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రూ. కోటి వరకు బకాయిలు

నిరుపేద వ్యవసాయ కూలీలు వేసవిలో ఉపాధి హామీ పనులపై ఆధారపడి జీవిస్తున్నారు. పంట కాలువలు, ఫాంపాండ్లు, ముళ్లకంచె తొలగింపు పనులు చేపట్టారు. ఇబ్రహీంపట్నం మండలంలో ఉపాధి పనులు చేస్తున్న సుమారు 700 మంది కూలీలకు రోజుకు సుమారు రూ.1.75 లక్షల చొప్పున రెండు నెలలకు సుమారు రూ.1 కోటి వరకు బకాయిలు చెల్లించాల్సి ఉంది. దీంతో కొంత మంది అప్పులు చేసి కుటుంబాన్ని నెట్టుకొస్తుంటే మరికొందరు అర్ధాకలితో అలమటిస్తున్నారు. బిల్లులు చెల్లించాలని కోరుతున్నారు.

'గోకులం' పరిస్థితి ఇలా..

గోకులం పథకంలో పశువులు, గొర్రెలు, కోళ్లఫారం రైతులను ప్రోత్సహించేందుకు మండలంలో 20 గోకులం షెడ్లు మంజూరు చేశారు. ఒక్కో షెడ్డుకు రూ.2.30 లక్షలు కేటాయించారు. అప్పులు చేసి షెడ్లు నిర్మించిన పాడి రైతులు బిల్లులు చేతికందక ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లో నిర్మించుకున్న 60 ఇంకుడు గుంతలకు ఒక్కోదానికి రూ.6 వేల చొప్పున రూ.3.60 లక్షలు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. అప్పులకు వడ్డీలు కట్టలేకపోతున్నారు.

ఉద్యాన పంటలకు అరకొర బిల్లులే

ఉపాధి హామీ పథకంలో ఉద్యాన పంటలకు సబ్సిడీ కోసం అనేకమంది రైతులు మునగ, మామిడి, నిమ్మ, బొప్పాయి పంటలు 120 ఎకరాల్లో సాగు చేశారు. గత ఏడాది ఆగస్టులో వచ్చిన వరదలతో అనేక పంటలు తుడిచిపెట్టుకు పోయాయి. రెండో విడత వేసిన పంటలకు ఆరు నెలల కాలంలో ఎకరాకు రూ.5 వేల లోపు మాత్రమే రైతుల ఖాతాల్లో పడ్డాయి. సుమారు రూ.50 లక్షల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. మరో మూడు నెలల్లో వ్యవసాయ సీజన్ ముగుస్తున్నప్పటికీ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు.

పల్లె పండుగకు నిధుల కొరత

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రభుత్వ పెద్దలు తమ కార్యకర్తలకు ఆదాయం వచ్చే మార్గాలపై దృష్టి పెట్టారు. పల్లె పండుగతో 57 మట్టి రోడ్లను సీసీ రోడ్లుగా నిర్మించేందుకు రూ.5.12 కోట్లతో అంచనాలు వేశారు. గత ఏడాది అక్టోబర్‌లో భూమి పూజలు చేసిన కూటమి కార్యకర్తలు కాంట్రాక్టర్ల అవతారమెత్తారు. ఇప్పటికి 45 రోడ్లు పూర్తి చేయగా, 12 రోడ్లు పూర్తి చేయాల్సి ఉంది. పూర్తయిన వాటికి ఒక్క రూపాయి బిల్లు చెల్లింపులు జరగలేదు. కాంట్రాక్ట్ పనులు చేస్తే కొంత వెనకేసుకోవచ్చని భావించిన కూటమి కార్యకర్తలకు బిల్లులు నిలిచిపోవడం మింగుడుపడటం లేదు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా

ఉపాధి హామీ కూలీల నగదు బిల్లులు ఎప్పటికప్పుడు సిద్ధం చేస్తున్నాం. జనవరి వరకు కొంత మేర చెల్లింపులు జరిగాయి. ఆ తర్వాత బిల్లుల నమోదు వెబ్‌సైట్ ఓపెన్ కావడం లేదు. కూలీల నగదు చెల్లింపు సమస్య ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తా.

– ప్రమీల, ఏపీఓ, ఇబ్రహీంపట్నం

చేసిన పనికి కూలి చెల్లించ లేదు



వేసవి కాలంలో ఆసరాగా ఉంటుందని నెల రోజులుగా ఉపాధి హామీ పనులకు వెళ్తున్నా. ఎర్రటి ఎండలో మట్టి పనులు చేస్తున్నాం. చేసిన పనులకు నగదు చెల్లింపులు జరగలేదు. చేసిన కష్టం చేతిక అందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం.

–ఏసమ్మ, ఉపాధి కూలీ, జూపూడి

నేడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో మీకోసం

నూజివీడు: పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీకోసం) కార్యక్రమం నిర్వహిస్తామని సబ్ కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. డివిజన్‌లోని ప్రజల నుంచి వారి సమస్యలపై అర్జీలను స్వీకరించి వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ముసునూరు: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం రెవెన్యూ కార్యాలయంలో నిర్వహిస్తామని తహసీల్దార్ కె.రాజ్‌కుమార్ తెలిపారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే కార్యక్రమంలో ప్రజా సమస్యలపై అర్జీలు స్వీకరిస్తామని చెప్పారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

మైలవరం: మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను కార్యాలయం ఇన్‌చార్జి నాగమల్లేశ్వరరావు నాయకులతో కలిసి ఆదివారం లబ్ధిదారులకు అందజేశారు. మైలవరం మండలంలోని వివిధ గ్రామాల్లో ఇటీవల అనారోగ్యానికి గురైన వారు వైద్య చికిత్సకు సంబంధించి ఆర్థిక సహాయం మంజూరు చేయించాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఎమ్మెల్యే స్పందించి సీఎం సహాయ నిధి నుంచి ఆర్థిక సహాయం మంజూరు చేయించారు.

రేపు హజ్రత్ షా బుఖారీ బాబా ఉరుసు

మైలవరం: మైలవరం తిరువూరు రోడ్డులోని బాబా హజ్రత్ సయ్యద్ షా బుఖారి షేక్ అవులియా దర్గాలో ఈ నెల 11న ఉరుసు మహోత్సవం జరుగుతుందని ఆహ్వాన కమిటీ సభ్యులు తెలిపారు. బాబా హజరత్ సయ్యద్ షా బుఖారి షేక్ అవులియా సందల్ (గంధ మహోత్సవం)లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మహిళలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు సీహెచ్ దుర్గ



ప్రదర్శన నిర్వహిస్తున్న మహిళా సమాఖ్య సభ్యులు

మైలవరం: ఎన్నికలకు ముందు మహిళలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలని మహిళా సమాఖ్య ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షురాలు సీహెచ్ దుర్గ కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని తాడిగూడెం, వెలగలగూడెం గ్రామాల్లో స్థానిక మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం ప్రదర్శన నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్ సౌకర్యం అమలు చేయాలని, తల్లికి వందనం పథకానికి నిధులు కేటాయించి అమలు చేయాలని, ఇతర హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళా సమస్యల పరిష్కారానికి పోరాటాలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. నాయకులు బుడ్డి రమేష్ మాట్లాడారు. కార్యక్రమంలో స్థానిక మహిళా సమాఖ్య నాయకురాలు సగ్గుర్తి నాగమ్మ, గద్దల పాప, డి. సంపూర్ణ, ఎస్. ఎలీశమ్మ, ఎస్. సంతోషం, జి. ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు. స్థానిక సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సగ్గుర్తి కోటేశ్వరరావు, జన్ని బాలయ్య, ఎస్. బాబూరావు సంఘీభావం తెలిపారు.

మహిళల సేవలు మరువలేం



చాట్రాయి: మంచి సమాజానికి మహిళా సేవ ఎంతో దోహదపడుతుందని నేషనల్ బీఆర్ అంబేడ్కర్ అవార్డు గ్రహీత పల్లె ప్రభ సాయి అన్నారు. ఆదివారం మండలంలోని చిన్నంపేట గ్రామంలో అంజలి ఎస్సీ, ఎస్టీ ల్యాండ్‌లెస్ ప్యూర్ పీపుల్స్ ట్రైబల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ కుటుంబానికి, దేశానికి మహిళలు చేస్తున్న సేవలు మరువలేనివన్నారు. మారుతున్న కాలానుగుణంగా మహిళలు అన్ని రంగాల్లో రాణించడం హర్షణీయమని చెప్పారు. కార్యక్రమంలో ట్రస్టు అధ్యక్షుడు కె.నరసింహారావు, ఉపాధ్యక్షురాలు మేడా జ్యోతి, కార్యదర్శి సుమన్, డాక్టర్ సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్కూళ్లను అభివృద్ధి చేయాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

నూజివీడు: కార్పొరేట్, ప్రైవేటు స్కూళ్లకు ధీటుగా ప్రభుత్వ స్కూళ్లను నడపాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ అన్నారు. పోతిరెడ్డిపల్లిలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో కేడీసీసీ బ్యాంకు మాజీ డైరెక్టర్ కొమ్మన నాగేశ్వరరావు కుమారుడు భూపేష్ రూ.3 లక్షలతో తన మేనకోడలు సాన్వి స్మారకార్థం నిర్మించిన భోజనశాలను ఆదివారం ఆయన ప్రారంభించారు. రామకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, దీనికి గాను ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. పాఠశాలల్లో అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పిస్తూనే విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని చెప్పారు. ఒకప్పుడు ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుకునే వారని, నేడు పరిస్థితులు పూర్తిగా మారిపోయాయన్నారు. విద్యార్థుల సౌకర్యార్థం భోజనశాలను నిర్మించిన భూపేష్ అభినందనీయుడని చెప్పారు. కార్యక్రమంలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, రాష్ట్ర సమితి సభ్యులు చలసాని వెంకట రామారావు, సర్పంచ్ తగరం సుజాత, విద్యా కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, మాజీ సర్పంచ్ అక్కినేని చందు, మాజీ ఎంపీటీసీ అక్కినేని సుజాత, అక్కినేని రాజా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దాసాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ



ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠలో భక్తులు, వేద పండితులు



ఆలయంలో ధ్వజస్తంభ స్థాపన

తిరువూరు: తిరువూరు జగన్నాథపురంలో పునర్నిర్మించిన పాటిమీద దాసాంజనేయస్వామి దేవస్థానంలో ఆదివారం ధ్వజస్తంభం, విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిగాయి. ఉదయం యాగశాలలో హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 10.55 గంటలకు ధ్వజస్తంభ స్థాపన, దాసాంజనేయస్వామి, సీతారామచంద్ర స్వామి, వ్యూహ వెంకటేశ్వరస్వామి, శ్రీకృష్ణపరమాత్మ, భగవత్ రామానుజుల విగ్రహాలు, శిఖర ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త వెల్లంకి సురేంద్ర బాబు పర్యవేక్షణలో వేద పండితులు పవన కుమారాచార్యులు, గోపాల కృష్ణమాచార్యులు, ఆలయ అర్చకులు పార్థసారథాచార్యులు, విఠలాచార్యులు తదితరులు ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు.

12 నుంచి రంగనాయక స్వామి కల్యాణోత్సవాలు

తిరువూరు: తిరువూరులోని రాజ్యలక్ష్మి సమేత రంగనాయకస్వామి ఆలయంలో కల్యాణోత్సవాలు ఈ నెల 12 నుంచి ప్రారంభమవుతాయని ఆలయ ధర్మకర్త దారా రంగారావు తెలిపారు. 12న అంకురార్పణ, ధ్వజారోహణ, 13న నిత్యహోమం, బలిహరణ, రంగనాయకస్వామి కల్యాణం జరుగుతాయని చెప్పారు. 14న స్వామివారి గ్రామోత్సవం, శాంతి హోమం, 16న ద్వాదశ ప్రదక్షిణలు, స్వామివారి పవళింపు సేవతో కల్యాణోత్సవాలు ముగుస్తాయని వివరించారు.

వైభవంగా ప్రతిష్ఠా మహోత్సవాలు

మక్కపేట(వత్సవాయి): పార్వతీ సమేత కాశీవిశ్వేశ్వర స్వామి, గంగమ్మ తల్లి నూతన ఆలయాల ప్రతిష్ఠా మహోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివార్ల విగ్రహాలకు క్షీరాధివాసం, ధాన్యాధివాసం, జలాధివాసం కార్యక్రమాలను వేదపండితులు యలమంచిలి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. దంపతులు పీటలపై కూర్చుని పూజాక్రతువులు నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు తరలి వచ్చి పూజలు చేశారు. ధ్వజస్తంభంతోపాటు సహ దేవతల విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. దేవదాయశాఖ ఈఓ సీహెచ్ హరిదుర్గానాగేశ్వరరావు, సర్పంచ్ మల్లెల శివప్రసాద్, మాజీ సొసైటీ అధ్యక్షులు కనగాల రమేష్, కొండబోలు బ్రహ్మం, అర్చకులు కేవైఎస్ శర్మ, యుగంధర్‌శర్మ, సంగయ్య శర్మ, హనుమంతురావుశర్మ, గ్రామ పురోహితులు రాఘవశర్మ, భక్తులు పాల్గొన్నారు.

బెల్లపు ఊట ధ్వంసం



కనుమూరులో లభ్యమైన బెల్లపు ఊట



ఓగిరాల తండాలో బెల్లపు ఊటను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

తిరువూరు: గంపలగూడెం మండలం కనుమూరు గ్రామ శివారులో సారా బట్టీపై తిరువూరు ఎక్సైజ్ అధికారులు ఆదివారం దాడి నిర్వహించారు. బట్టీ సమీపంలో సారా తయారీకి సిద్ధం చేసిన 600 లీటర్ల బెల్లపు ఊటను ఎక్సైజ్ ఎస్ఐ కృష్ణవేణి ధ్వంసం చేశారు. సారా తయారీ, అమ్మకాలు జరిపే వారిపై పీడీ చట్టం నమోదు చేస్తామని హెచ్చరించారు.

కుమ్మరికుంట్లలో సారా బట్టీ ధ్వంసం

తిరువూరు: ఎ.కొండూరు మండలం కుమ్మరికుంట్లలో ఆదివారం సారా బట్టీని ఎక్సైజ్ అధికారులు ధ్వంసం చేశారు. ఏడు ఖానాల తూము వద్ద సారా బట్టీ నిర్వహిస్తున్నట్లు సమాచారం అందుకుని ఎస్ఐ వెంకటకుమార్ దాడి చేశారు. ఐదు లీటర్ల సారా, 30 లీటర్ల బెల్లపు ఊట లభ్యమైంది. సారా బట్టీ ధ్వంసం చేసి కేసు నమోదు చేశారు.

300 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

నూజివీడు: స్థానిక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని నూజివీడు మండలం ఓగిరాల తండాలో ఆదివారం నిర్వహించిన దాడుల్లో 300 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేయడంతో పాటు ఐదు లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ ఎ. మస్తానయ్య తెలిపారు. గ్రామానికి చెందిన ధరావతు పార్వతిపై కేసు నమోదు చేశారు. సీఐ మాట్లాడుతూ సారా తయారు చేసినా, విక్రయించినా, సరఫరా చేసినా చట్టప్రకారం నేరమన్నారు. అలాంటి నేరాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా నేరాలకు పాల్పడితే సెల్: 94409 02462 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు.

కుక్కలు, కోతుల స్వైరవిహారం



మైలవరం బస్టాండ్ రోడ్డులో సంచరిస్తున్న కుక్కలు



కుక్కల దాడిలో బాధితుడికి అయిన గాయాలు

బయటకు వచ్చేందుకు భయపడుతున్న ప్రజలు

మైలవరం: మైలవరంలో కుక్కలు, కోతులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మైలవరం రామకృష్ణ కాలనీ, ఆర్టీసీ బస్‌స్టాండ్ పక్కన వీధిలోను, మరి కొన్ని ప్రాంతాల్లో కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతున్నాయి. వాహన చోదకులు, పాదచారులపై దాడులు చేస్తున్నాయి. ముఖ్యంగా చిన్నారులు, మహిళలు, వృద్ధులు బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. కోతులు ఇళ్ల గోడలపై తిరుగుతూ మహిళలను, పిల్లలను భయపెడుతున్నాయి. రామకృష్ణ కాలనీలో విద్యాలయాలు ఉండటంతో ఉదయం, సాయంత్రం స్కూల్ పిల్లలు వస్తూపోతూ ఉంటారు. కోతుల భయంతో వారు ఆందోళనకు గురవుతున్నారు. పిల్లల చేతుల్లో ఉన్న తినుబండారాలను తీసుకుపోతున్నాయి. పంచాయతీ వారు స్పందించి కుక్కలు, కోతుల నిర్మూలనకు తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంది.

సమస్య పరిష్కరించాలి

గతంలో రామకృష్ణ కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో బోన్‌లు ఏర్పాటు చేసి కోతులను పట్టుకుని పొందుగల సమీపం పంగిడి ప్రాంతంలోని అటవీ ప్రాంతంలో వదిలిపెట్టేవారు. దాని వలన కొంత వరకు కోతుల సమస్య పరిష్కారమైంది. ఇప్పుడు మళ్లీ కోతులు మందలు మందలుగా తిరుగుతూ స్థానికులను ఇబ్బందులు పెడుతున్నాయి. అప్రమత్తంగా లేకుంటే ఇళ్లల్లోకి ప్రవేశించి ఆహార పదార్థాలు తస్కరించుకుపోతున్నాయి. పంచాయతీ వారు స్పందించి కోతులు, కుక్కలను పట్టించి పంగిడి అటవీ ప్రాంతంలో వదిలితే కొంత ఉపశమనంగా ఉంటుంది.

–టి. ఏసు, రామకృష్ణ కాలనీ, మైలవరం

మద్యం అక్రమ విక్రయాల నియంత్రణకు పటిష్ట చర్యలు

కంచికచర్ల: బెల్టుషాపుల ద్వారా మద్యం విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కంచికచర్ల ప్రొహిబిషన్, ఎక్సైజ్‌శాఖ సీఐ షేక్ అఫ్రపునీసాబేగం ఆదివారం హెచ్చరించారు. కంచికచర్ల ఎక్సైజ్ శాఖ పరిధిలోని 38 గ్రామాల్లో అక్రమ మద్యం విక్రయాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టామన్నారు. అక్రమంగా మద్యం తరలించినా, అమ్మినా కేసు నమోదు చేస్తామన్నారు. గతేడాది అక్టోబర్ నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి నెలాఖరు వరకు మొత్తం 61 కేసులు నమోదయ్యాయని, 1,163 మద్యం సీసాలను స్వాధీనం చేసుకోవడంతోపాటు మూడు వాహనాలను సీజ్ చేశామని వివరించారు.

అపూర్వం.. ఆత్మీయ సమ్మేళనం



తిరువూరు: గంపలగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు ఆదివారం సమావేశమయ్యారు. పాఠశాల ఆవరణలో జరిగిన ఆత్మీయ సమావేశంలో 1974–75 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు 50 మందికి పైగా హాజరయ్యారు. పాఠశాలలో తాము గడిపిన గత స్మృతులను నెమరువేసుకున్నారు. అనంతరం తమకు విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులను సత్కరించారు. పాఠశాల అభివృద్ధికి తమవంతు చేయూత ఇస్తామని ప్రకటించారు. మాజీ ఎంపీపీ కోట దాసు ఆధ్వర్యంలో ఈ సమ్మేళనం జరిగింది.